క్లుప్తంగా

శేషతల్ప వాహనంపై శ్రీనివాసుడు



శేషతల్ప వాహనంపై స్వామి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శేష తల్ప వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్యార్చనలు, పూజలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని శేషతల్ప వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి ఊరేగించారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురాలతో నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

మునగపాక: పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట దళితవాడలో బుధవారం జరుగుతున్న పారిశుధ్యం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ మంగలక్ష్మి, ఇతర పాలకవర్గ సభ్యులంతా గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన



సత్యవరం గ్రామంలో క్షేత్ర సందర్శన చేస్తున్న అధికారులు

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం 1, 2 గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పొలాల్లో క్షేత్ర సందర్శన చేశారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాలపై రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ అవగాహన కల్పించారు. వరి పొలాల్లో అపరాలు సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పి.మౌనిష్, అమృత, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన



పీఏసీఎస్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. పీఏసీఎస్ సీఈవో పినపాత్రుని నాగభూషణం ఆధ్వర్యంలో ముందుగా పాయకరావుపేట పీఏసీఎస్ ఎదుట సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో 36 అమలు చేయాలని, ఉద్యోగ వయోపరిమితి పెంచాలని, వేతన సవరణ చేయాలని, ఎల్ఎస్ఎఫ్ ఏర్పాటు చేయాలని, 2019 తర్వాత ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, గ్రాట్యుటీ చట్టం ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ఈశ్వరరావు మృతికి సంతాపం



మునగపాక: మండలంలోని టి.సిరసపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలమరశెట్టి ఈశ్వరరావు గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈశ్వరరావు గతంలో నాగులాపల్లి పీఏసీఎస్ డైరెక్టర్‌గా, ఉత్తరాంధ్రలో పేరొందిన వీరభద్రస్వామి ఆలయ చైర్మన్‌గా సేవలందించారు. బుధవారం గ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొద్దేడ ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, సర్పంచ్‌లు మద్దాల నాగ ప్పారావు, సుందరపు తాతాజీ, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ దొడ్డి బాలాజీ తదితరులు ఈశ్వరరావు అంత్యక్రియలకు హాజరై సంతాపం తెలిపారు. ఈశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.



కొత్తపేట జిల్లా పరిషత్ స్కూల్‌లో క్రాఫ్ట్ క్లాసులో బొమ్మలు తయారీపై విద్యార్థులకు శిక్షణ నిస్తున్న ఉపాధ్యాయిని అపర్ణ

వ్యర్థాలతో అద్భుతాలు

- క్రాఫ్ట్‌లో కొత్తపేట హైస్కూల్ విద్యార్థులు అదుర్స్
- ప్లాస్టిక్, కాగితాలు, గాజు వ్యర్థాలతో అపురూప కళాకృతుల తయారీ
- ప్రత్యేక శిక్షణతో రాణిస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: వారి చేతిలో పడితే.. పనికిరాని పేపర్లు ఆకట్టుకునే బొమ్మలు అయిపోతాయి. మూలన పడేసిన వస్తువులు అపురూప కళాకృతులుగా మారిపోతాయి. పాత పేపర్లు, పనికిరాని ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, వృథాగా పడేసిన చేతి గాజులు.. ఇలా కొదేదీ అనర్హం అని నిరూపిస్తున్నారు యలమంచిలి పట్టణం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. క్రాఫ్ట్ ఉపాధ్యాయిని అపర్ణ, ప్రధానోపాధ్యాయుడు వైవీ రమణ, తదితరుల సహకారంతో చదువుతో పాటు క్రాఫ్ట్‌లోనూ రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. విద్యార్థులు చేతుల్లో రూపుదిద్దుకున్న బొమ్మలు, కళాఖండాల్లో కొన్నింటిని పాఠశాలలో ఓ బీరువాలో అందరూ చూసేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. పాఠశాలలో ప్రతి రోజూ రెండు తరగతులకు క్రాఫ్ట్ పీరియడ్లు కేటాయించడంతో విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

విద్యార్థుల నైపుణ్యం భళా

ప్లాస్టిక్ స్పూన్లతో అలంకరణ వస్తువులు, వాడి పడేసిన టీ కప్పులతో వాల్ హ్యాండిల్స్, ప్లాస్టిక్ సంచులతో పువ్వులు, ప్లాస్టిక్ బాటిళ్లతో ఫ్లవర్ వాజ్‌లు, ఖాళీ బీరు సీసాలతో వాటర్ పెయింటింగ్స్, పాత న్యూస్ పేపర్లు, కలర్ పేపర్లతో బుట్టలు, బ్యాగులు, క్రిస్మస్ స్టార్లు, ట్రీ, శాంతాక్లజ్, పాత చేతి గాజులను కొత్తవిగా ఆకర్షణీయంగా మార్చడం, దుస్తులపై వివిధ రకాల డిజైన్లతో ఎంబ్రాయిడరీ, అలంకరణ, గృహోపకరణ వస్తువుల వంటివి తయారు చేస్తూ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని చాటుతున్నారు. ఇటీవల కొత్త సంవత్సరం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన గ్రీటింగ్ కార్డులు, ప్లాస్టిక్ రిబ్బన్లు.. ఇలా విద్యార్థుల చేతుల్లో తయారవుతున్న వస్తువులను చూసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు తల్లిదండ్రులు ప్రశంసిస్తున్నారు.

చిన్ననాటి నుంచి ఇష్టం



చిన్ననాటి నుంచి క్రాఫ్ట్ అంటే ఇష్టం. పాత దిన పత్రికలు, వాడేసిన దువ్వెనలతో పలు రకాల వస్తువులు తయారు చేశా. ఇటీవల మా స్కూల్‌లో నిర్వహించిన క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోటీల్లో నాకు బహుమతి వచ్చింది. క్రాఫ్ట్ ఉపాధ్యాయిని అపర్ణ మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో చాలా మందికి క్రాఫ్ట్‌పై ఆసక్తి కలిగింది.

– షణ్ముఖ ప్రియ, 7వ తరగతి

క్రాఫ్ట్ క్లాస్ అంటే ఎంతో ఆసక్తి



స్కూల్‌లో అన్నింటి కంటే క్రాఫ్ట్ క్లాస్ అంటే ఎంతో ఇష్టం. మా తరగతి పుస్తకాల్లో పాఠాలతో పాటు క్రాఫ్ట్‌లో సృజనాత్మకతతో వస్తువులు తయారు చేయడం ఎంతో సరదాగా, ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించినట్టుగా ఉంటుంది. క్రాఫ్ట్‌లో శిక్షణ చదువులోనూ ఉపయుక్తం అవుతోంది. ఇటీవల మాతో పాటు మరికొందరు విద్యార్థులు క్రాఫ్ట్ నేర్చుకునేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు.

– ఎ.ప్రియ, 6వ తరగతి

గ్రీటింగ్ కార్డులు తయారు చేశాం..



ఇటీవల ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా రంగు రంగుల గ్రీటింగ్ కార్డులు తయారు చేశాం. వాటిని చూసిన వారందరూ మమ్మల్ని ఎంతగానో మెచ్చుకున్నారు. చేతి నైపుణ్యం ద్వారా రూపొందిస్తున్న వివిధ రకాల వస్తువులు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. స్కూల్‌లో క్రాఫ్ట్ టీచర్ ఇచ్చే శిక్షణ మాకు ఎంతగానో ఆసక్తిగా ఉంటోంది. క్రాఫ్ట్‌లో నైపుణ్యంతో భవిష్యత్తులో ఉపాధి పొందవచ్చని ప్రోత్సాహం ఇస్తున్నారు.

– పృథ్వీ, 7వ తరగతి

చిన్నప్పట్నుంచే నేర్పిస్తేనే నైపుణ్యం



విద్యార్థులకు చిన్నప్పట్నుంచే క్రాఫ్ట్‌లో తర్ఫీదునిస్తే మంచి నైపుణ్యం వస్తుంది. విద్యార్థుల్లో ఉండే ఊహాశక్తికి ప్రతిరూపంగా వివిధ రకాల బొమ్మలు, వస్తువులు తయారు చేస్తారు. కొందరు విద్యార్థులు సృజనాత్మకతతో తయారు చేస్తున్న కాగితపు పువ్వులు, పర్యావరణహిత వస్తువులు చూస్తే వారి ఆలోచనలు ఎంత బాగున్నాయో అర్థమవుతుంది. ఇటీవల మా స్కూల్‌లో క్రాఫ్ట్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకోవడం ఆనందాన్నిచ్చింది.

– జి.అపర్ణ, క్రాఫ్ట్ ఉపాధ్యాయిని

ఇష్టంతో నేర్చుకుంటున్నారు..



క్రాఫ్ట్‌పై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. సాధారణ పాఠ్యాంశాల బోధనతో పోల్చితే క్రాఫ్ట్ తరగతులు ప్రయోగాత్మకంగా, సృజనాత్మకంగా ఉంటున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల స్పందన చూసి మాకు కూడా సంతోషంగా ఉంటోంది. స్కూల్ టైమ్ టేబుల్‌లో క్రాఫ్ట్‌కు ప్రత్యేక తరగతులు కేటాయించాం.


– వైవీ రమణ, ప్రధానోపాధ్యాయుడు, కొత్తపేట జెడ్పీ హైస్కూల్

పొగ మంచు సోయగం



మైదానం మంచు ముసుగేసుకుని మురిపిస్తోంది. దట్టంగా అలిమేసిన పొగమంచుతో ఇది లంబసింగా అన్న భ్రమను కలిగిస్తోంది. మంచుతో కప్పబడిన ప్రకృతి సోయగం కనువిందు చేస్తోంది. రహదారులు, పంట పొలాలు మంచుతో నిండిపోయి వింతైన అనుభూతినిస్తున్నాయి. వాహనచోదకులు మాత్రం మంచు కారణంగా రహదారుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బంది పడ్డారు. తెల్లవారినా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. - కోటవురట్ల

చందనం అలంకరణలో వెంకన్న



ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి చందన పూత అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో గతేడాది డిసెంబర్ 15 నుంచి తిరుప్పావై పాశురాలు విన్నపాలు చేస్తూ నిత్య పూజలు చేసున్నారు. ఈ క్రమంలో బుధవారం స్వామి వారి నిజరూప దర్శనాన్ని చందనంతో అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



దోసూరులో మేలుకొలుపు నిర్వహిస్తున్న భక్తులు

అచ్యుతాపురం: ధనుర్మాసంలో భగవంతుడిని పూజిస్తే వెయ్యేళ్ల పూజా ఫలం దక్కుతుందని యలమంచిలి సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు అన్నారు. మండలంలోని దోసూరులో 24వ రోజు బుధవారం తెల్లవారు జామున మేలుకొలుపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసం మొదలు సంక్రాంతి వరకూ పల్లకీలో దేవుని విగ్రహాలను ఊరేగిస్తూ హరినామ సంకీర్తన నిర్వహిస్తే మంచి జరుగుతుందన్నారు. పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు వెన్నెల అప్పలనాయుడు మాట్లాడుతూ విశ్వం మారుతూనే ఉంటుందని, ఎప్పటికీ మారనిది భగవంతుడు ఒక్కడేనని చెప్పారు.

కష్ట కాలంలో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



బోయిన లక్ష్మి చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు

ఎస్.రాయవరం: కష్ట కాలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు అన్నారు. సైతారుపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు బోయిన లక్ష్మి పెదకర్మ సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఏ అవసరం ఉన్నా పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

- బోయిన లక్ష్మి కుటుంబ సభ్యులను యలమంచిలి మాజీ ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు బుధవారం పరామర్శించారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

అక్రమ అరెస్టులపై నిరసనల వెల్లువ



రాంబిల్లిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



వెంకటాపురంలో సీఐటీయూ నేత సత్యనారాయణను అదుపులోకి తీసుకున్న పోలీసులు



తిమ్మరాజుపేటలో సీఐటీయూ నేత బ్రహ్మాజీని ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



రాజయ్యపేటలో అరెస్ట్ చేసి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తరలించిన సీపీఎం నాయకులు

రాంబిల్లి(యలమంచిలి): వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకుల అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలపై నిరసనలు వెల్లువెత్తాయి. విశాఖలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో రాంబిల్లిలో బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం సొంత గనులు కేటాయించలేకపోయిందన్నారు. ప్రజలకు హాని కలుగుతుందని కాకినాడలో తిరస్కరించిన బల్క్ డ్రగ్స్ పార్కును నక్కపల్లిలో ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. పూడిమడక గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌లో స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాంబిల్లిలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు సీపీఎం మండల కార్యదర్శి దేముడునాయడును రాంబిల్లి పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

పోలీసుల అదుపులో కమ్యూనిస్టు నాయకులు

మునగపాక: విశాఖలో బుధవారం జరిగిన ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మునగపాక మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సీఐటీయూ నేత గనిశెట్టి సత్యనారాయణ, తిమ్మరాజుపేటకు చెందిన ఎస్.బ్రహ్మాజీలను మునగపాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు నేతలు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు.

పోలీస్ స్టేషన్‌లో సీపీఎం నాయకులు

ఎస్.రాయవరం: మండలంలో పి.ధర్మవరం గ్రామంలో సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజును రెండో రోజు బుధవారం కూడా గృహ నిర్బంధం చేశారు. అలాగే బుధవారం బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా రాజయ్యపేటలో జరిగిన ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నాయకుడు ఎం.సత్యనారాయణతో పాటు పలువురిని అరెస్ట్ చేసి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కస్తూర్బాలో ముందస్తు సంక్రాంతి శోభ



విద్యార్థినులు వేసిన ముగ్గు



పాయసం తయారు చేస్తున్న విద్యార్థినులు

నక్కపల్లి: ముత్యాల ముగ్గులు, భోగి మంటలు, గొబ్బిళ్లు, సంప్రదాయ దుస్తులతో స్థానిక కస్తూర్బా పాఠశాలలో బుధవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి పాల్గొన్నారు. బాలికలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. పాయసం, పలురకాల పిండివంటలను తయారు చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సలీమా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



కేజీబీవీలో భోగి మంట వేస్తున్న సిబ్బంది



పిండి వంటలు తయారు చేస్తున్న విద్యార్థినులు, సిబ్బంది

వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి బాబ్జి మృతి



నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ నక్కపల్లి పట్టణ శాఖ మాజీ అధ్యక్షుడు, నక్కపల్లి పంచాయతీ ఐదో వార్డు సభ్యుడు కర్రి బాబ్జి(60) బుధవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు కాకినాడ తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి చురుకైన పాత్ర పోషిస్తూ నక్కపల్లిలో పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఐదో వార్డు సభ్యుడిగా గెలుపొందారు. బాబ్జి మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ సంతాపం తెలిపారు. బాబ్జి మృతి పట్ల ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్ నేతల రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

నిర్మానుష్యంగా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం



నిర్మానుష్యంగా మునగపాక మండల సముదాయాల ప్రాంగణం

మునగపాక: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం నిర్మానుష్యంగా మారింది. మోదీ పర్యటనలో అధికారులు తలమునకలు కావడంతో ప్రజలు కూడా కార్యాలయాల దరికి వచ్చేందుకు అంతగా ఆసక్తి చూపలేదు. అధికారులు అందుబాటులో ఉంటారో లేదో అన్న అనుమానంతో కార్యాలయాల దరికి రాలేదు. మండల పరిషత్, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, ఎంఈవో, వెలుగు, ఉపాధి హామీ పథకం తదితర కార్యాలయాలన్నీ ఒకే చోట ఉన్నాయి. కింద స్థాయి నుంచి మండల స్థాయి అధికారులంతా పీఎం పర్యటనలో ఉండడంతో విషయం తెలియక కొంత మంది తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చి నిరాశతో వెనుదిరిగారు.